క్లుప్తంగా

సబ్సిడీతో శనగ విత్తనాల పంపిణీ

జమ్మలమడుగు : రబీ సీజన్‌లో సాగుచేసే శనగ విత్తనాలను రైతులకు 25 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి తాటి గురుభాస్కర్ తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర క్వింటా రూ.9400 కాగా ప్రభుత్వం రూ.2350, రైతులు రూ.7050 చెల్లించి విత్తనాలు తీసుకుపోవాలన్నారు. మండలానికి 3400 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. సబ్సిడీ విత్తనాలకు వచ్చే రైతులు తమ పట్టాదారు పాసు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌లను తీసుకుని తమ ఏరియాలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

జమ్మలమడుగు : స్థానిక రిపబ్లిక్ క్లబ్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి కార్పొరేట్ వైద్యులతో పరీక్షలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ దేవగుడి సుబ్బరామిరెడ్డి, శంకర్‌రెడ్డి ట్రస్టుల ద్వారా కొన్ని సంవత్సరాలుగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామంలో వెలసిన అచ్చివెళ్లిగంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పులివెందుల ప్రాంతం నుంచేకాక కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

నేటినుంచి విత్తనాల పంపిణీ

ముద్దనూరు : రబీసీజన్‌లో సాగు చేసే శనగపంటకు రాయితీపై విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. 25 శాతం రాయితీతో అందించే ఈ విత్తనాలు పొందడానికి ఆయా రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని ఏవో తెలిపారు. మండలానికి 1047 కిటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని, రాయితీ కాకుండా క్వింటాలుకు రూ.7050లు చెల్లించాలని ఆయన తెలిపారు.

అమ్మవారికి బంగారు నేత్రాల బహూకరణ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదరవీధిలోని శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారికి రూ.1.55 లక్షల విలువ చేసే 26 గ్రాముల బంగారు నేత్రాలను బహూకరించారు. అంపావతిన రామయ్య, అచ్చమ్మల కుమారుడు నాగరాజు, కోడలు విజయలక్ష్మిలు వీటిని కానుకగా ఆదివారం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనంకు అందించగా, పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్, ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు రామచంద్రుడు, భక్తులు పాల్గొన్నారు.

రాచమల్లుకు అభినందనల వెల్లువ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాచమల్లును కలిసి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజాంరెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, సోములవారిపల్లె పంచాయతీ ఒకటో వార్డు ఇన్‌చార్జి, ఎంపీటీసీ బాలగుర్రమ్మ గోటూరు వెంకటేష్, సోమాపురం గ్రామ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, సునీల్‌కుమార్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తదితరులు రాచమల్లుకు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు.

నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ ఆదివారం సందర్శించి నివాళి అర్పించారు.

మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరాలు



ఆనాడు సమాచారం పంపడానికి వాడే ఇంగ్లాండు లెటర్లు



పోస్టు కార్డు



ఎర్రగుంట్లలో ఉన్న పోస్టు బాక్స్

ఎర్రగుంట్ల : తోకలేని పిట్ట 90 ఆమడల దూరం పోయింది. అది ఏమిటి అని సామెత అడిగిన వెంటనే ఉత్తరం అని సమాధానం వచ్చేది. అయితే ఇప్పుడు ఆ మాట చెప్పుకునేందుకు తప్పా ఉత్తరం రాసేవారే కరువయ్యారు. పోస్టు అని ఇంటి ముంగిట పోస్టుమెన్ కేక వేయగానే ఉత్తరం అందుకునేందుకు పరుగున వచ్చేవారు. తమ బంధుమిత్రులు అందించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉత్తరాల కోసం ఎదురుచూసేవారు. మంచి ఉత్తరాలను భద్రంగా దాచుకునేవారు. అవి ఇప్పుడు మధుర జ్ఞాపకాల్లా మిగిలిపోయాయి.

ఉత్తరంలో మనస్సుకు హత్తుకునేలా సంబోధన..

నేటి సమాజంలో పిల్లలకు పోస్టులో ఉత్తరం వచ్చి దానిని చదువుకుని ఎంతో తృప్తిపడేవారమని పెద్దలు చెబితే.. ఇంకా లేఖలు ఏమిటీ.. నేరుగా సెల్ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం కదా... అని సమాధానమిస్తున్నారు. నేడు ముఖాముఖిగా వాట్సాప్ కాల్‌లో మాట్లాడుతున్నా సంబోధనల్లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి.

అయితే ఉత్తరంలో పలకరింపులు, సంప్రదాయ బద్ధంగా ఉంటూ మనస్సును ఆకట్టుకునేలా ఉండేవి. పెద్దలైతే మహారాజశ్రీ... చిన్న వారు అయితే చిరంజీవి.. మహిళలను లక్ష్మీ సమానురాలైన.. వితంతువులైతే గంగాభగీరథి సమానులైన అనేలా సంబోధించేవారు. అలాగే ఉత్తరం ప్రారంభం, ముగింపులో పెద్దలకు అయితే నమస్కారాలతో అని, చిన్న వారికి ఆశీస్సులతో... అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వార్తను ఉత్తరంలో రాసేటప్పుడు ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. ఆ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటనే చించివేసేవారు. అలాగే ముఖ్యమైన సమాచారం ఉండే లేఖలను జాగ్రత్తగా కమ్మికి కుట్టి పెట్టేవారు.

పోస్టాఫీసులో సేవలు..

ప్రధానంగా పోస్టాఫీసులో చాలా సేవలు ఉన్నాయి. ప్రతి రోజూ రిజిస్టర్, క్యాష్ ఆన్ డెలివరి, స్పీడు పోస్టు, రిజిస్టర్ పోస్టులు, పార్సిళ్లు, వాల్యూమ్ టేబుల్ పోస్టు, వాల్యూమ్ టేబుల్ లేటర్లు, ఏటీఎంలు, కోర్టు నోటీసులు ఇలా సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పోస్టుమెన్‌లు చిరునామాల ప్రకారం ఇంటికి అందజేస్తారు. పూర్తిస్థాయిలో ఇంగ్లాండ్ లేటర్‌లు, సెల్‌ఫోన్ రావడంతో తగ్గుముఖం పట్టాయి. బిజినెస్ లెటర్లు ఆర్డినరీ లేటర్లు, మాత్రమే పోస్టాఫీసు ద్వారా కార్యాలయాలకు ఇళ్లకు అందుతున్నాయి.

స్మార్ట్ ఫోన్ రాకతో ఉత్తరాల ఊసే లేదు..

ఉత్తరాలు రాసుకునే రోజుల్లో శ్రీవారికి ప్రేమలేఖ ఇలా ఎన్నో సినిమాలు తీశారు. అవి ప్రేక్షకులను సైతం విశేషంగా అలరించాయి. అయితే నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లను గంటల తరబడి వాడుతున్నప్పటికి అవతలి వారి యోగక్షేమాలను మాట్లాడే పరిస్థితి లేదు. ఒకటి, రెండు మాటలు మాట్లాడిన తర్వాత టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, ఇలా వేరే వ్యాపకాలకు మొగ్గు చూపుతున్నారు. క్షేమ సమాచారాలను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులతో పంచుకునేందుకు కూడా ఇష్టపడటం లేదు. ఉత్తరాలు రాసుకునే సమయంలో మరో ఉత్తరం వచ్చేంత వరకు ఎదురు చూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి చాలా రోజులయ్యిందనే దిగులు ఉండేది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో సోమవారం అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ బాలసంజీవులు తెలిపారు. తాతిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని 11–కేవీ, తాతిరెడ్డిపల్లె, నేర్జాంపల్లె గ్రామాలలో ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియెగం చేసుకోండి

వేంపల్లె : జమ్మలమడుగులో నేడు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు, ప్రసాదురావు, మురళీధర్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని రిపబ్లిక్ క్లబ్‌లో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 50 పెద్ద కంపెనీలు, 15 చిన్న కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8179813014, 9666291564 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కమలాపురం : మండలంలోని గంగవరం గ్రామ సచివాలయం పక్కన ఆదివారం పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3,860 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్ల ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన సూఫియాన్

కమలాపురం : పట్టణానికి చెందిన ఎస్.మహ్మద్ సూఫియాన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. సూఫియాన్ కడప నగరంలోని డా.వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 బాలుర విభాగం కిడ్స్ జావలిన్ త్రో ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రతభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ నెల 18 తేదీలోపు నేషనల్ సెలక్షన్ లిస్ట్ వస్తుందని, అందులో సూఫియాన్ పేరు తప్పక వస్తుందని కోచ్ వెంకటేశ్వరరావ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా స్పోర్ట్స్ స్కూల్ ఎస్ఓ జగన్‌మోహన్ రెడ్డి సూఫియాన్‌ను, కోచ్ వెంకటేశ్వరరావ్‌ను అభినందించారు.

కంపుకొడుతున్న అర్బన్ పోలీస్‌స్టేషన్ మరుగు దొడ్లు



దుర్వాసన వస్తున్న మరుగుదొడ్లు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మరుగు దొడ్లు కంపుకొడుతున్నాయి. మరుగు దొడ్ల నుంచి వచ్చే దుర్వాసనను భరించ లేకుండా ఉన్నామని వివిధ కేసుల నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలు, స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరగు దొడ్లనుంచి దుర్వాసన రాకుండా సంబంధిత అధికారులు వాటిని శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వేమన తత్వాన్ని ఒడిసి పట్టిన శివారెడ్డి

– వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

కడప కల్చరల్ : వేమన తత్వాన్ని పరిశీలించి, పరిశోధించి.. ఆయనను శూన్యవాదిగా చెప్పిన మొట్టమొదటి వ్యక్తి ఆచార్య శివారెడ్డి అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కడపలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి.శివారెడ్డి రచించిన వేమన పద్యాలు అనే పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వేమన పద్యాల్లో ఉన్న ఎరుక, బయలు అనే పదాల గురించి బాగా విశ్లేషించి.. వేమన ఏ మతానికి చెందిన వాడు కాదని, అతని తత్వం నాగార్జునని, శూన్యవాదానికి దగ్గరగా ఉందని, నూతన కోణంలో చెప్పడం విశేషమన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ శివారెడ్డి తన రచనలో కుల వ్యవస్థను వేమన పూర్తిగా వ్యతిరేకించారని, జన్మతా అందరూ శూద్రులేనని, సంస్కారం ద్వారా మాత్రమే బ్రాహ్మణులుగా మారుతారని చెప్పడం ఆయన పరిశీలనా దృష్టికి నిదర్శనమన్నారు. అనంతరం సంస్థ సభ్యులు ఆచార్య శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి భూమిరెడ్డి స్వరూపారాణి, సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కవి మామిళ్ళ లోకనాథం, హిందూ ధర్మం సమాజ ప్రార్థనా దేవాలయ సంస్థ వైస్ చైర్మన్ కాల్వ సోము కళానాథరెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలి

వేంపల్లె : పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాదు కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 కోట్లతో నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. బస్టాండ్ ప్రారంభం కాక పోవడంతో ప్రయాణికుల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు బీగాలు వేశారన్నారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నాడున్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

జమ్మలమడుగు : నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న బీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బ్రహ్మనందరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీకి ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు కల్చరల్: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో శిక్షణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు శిక్షణ ఉంటుందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9705333305 నంబరుకు సంప్రదించాలని కోరారు.

మొక్కలను పరిశీలించిన జాయింట్ కమిషనర్



చీనీ మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ శివప్రసాదు

లింగాల : మండలంలోని ఉపాధిహామీ పథకం హర్టికల్చర్ ద్వారా రైతులకు అందించిన చీని మొక్కల పెంపకాన్ని, డ్రాగన్ ఫ్రూట్స్, కొబ్బరి చెట్టు పెంపకాలను ఆదివారం జాయింట్ కమిషనర్ శివప్రసాదు పరిశీలించారు. మండలంలోని అక్కుల గారిపల్లె, పెద్దకూడాల, లింగాల గ్రామాలలో ఆయన పర్యటించారు. 250 ఎకరాలలో సాగు అవుతున్న చీనీ మొక్కలు, రెండు ఎకరాల్లో కొబ్బరి చెట్లు, డ్రాగన్ ఫ్రూట్స్ పెంపకాలను పరిశీలించారు. పెద్దకూడాల పాఠశాలలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. రైతులకు మరిన్ని పండ్ల తోటల పెంపకాలపై ప్రొత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుబ్బారెడ్డి, ఏఓ లోకేశ్వరరావు, ఏపీఓ గంగరాజు, ఉపాధి హామీ టెక్నికల్, పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆ నలుగురూ..



అంత్యక్రియలను నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్ సభ్యులు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం చదిపిరాళ్లదిన్నె గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ(39) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఆమెకు బంధువులు ఉన్నా ఆమె అంత్యక్రియలకు ఎవ్వరూ ముందుకు రాక పోవడంతో ఆ నలుగురు..(మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు) ముందుకు వచ్చి అంత్యక్రియలను పూర్తి చేశారు. అంత్యక్రియల్లో ఫౌండేషన్ చైర్మన్ మోరె లక్ష్మన్‌రావు, సుబహన్, మునేంద్ర, నరేంద్ర, కుమార్, భాస్కర్‌లు హిందూ సంప్రదాయం ప్రకారం ఆమెకు అంత్యక్రియలను నిర్వహించారు.

ఉత్తమ సేవలతోనే అవార్డులు వరిస్తాయి



ఉత్తమ అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు

పులివెందుల టౌన్ : ఉత్తమ సేవలతోనే అవార్డులు వరిస్తాయని ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఆదివారం స్థానిక సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం అవార్డులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీ రామమోహన్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించగా, జెఎన్‌టీయూ అధ్యాపకురాలు డాక్టర్ కల్లూరు శేషమహేశ్వరమ్మ ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణిగా అవార్డు పొందారన్నారు. ఉచితవిద్య ఉపాధ్యాయ బృందంలోని ఇరువురికి ఉత్తమ అవార్డులు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగాయత్రీదేవి అలంకారాలలో అమ్మవారు



పులివెందులలో శ్రీగాయత్రీదేవి అలంకారంలో



సింహాద్రిపురంలో శాఖాంబరీగా అమ్మవారు



వల్లూరులో శ్రీ పార్వతీదేవి అలంకారంలో



చెన్నూరులో శ్రీభవానీదేవిగా అమ్మవారు



కమలాపురం: అలంకారంలో శ్రీగాయత్రీదేవి

పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని నాల్గవరోజు ఆదివారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో ప్రధాన అర్చకులు యోగి నవీన్‌కుమార్ శర్మ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీగాయత్రిదేవి అలంకారంలో తీర్చిదిద్దారు. అంకాలమ్మ ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ రమణలు, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పట్టణంలోని గాయత్రినగర్ కాలనీలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సింహాద్రిపురం : స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారు నరశింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారు శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్య వైశ్య కల్యాణ భవనంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆదివారం శ్రీ పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్యులు పాల్గొని అమ్మవారికి కాయ కర్పూరాలను సమర్పించారు.

వల్లూరు (చెన్నూరు) : పడమటి వీధిలోని చౌడేశ్వరి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారిని శ్రీ భవానీదేవిగా అలంకరించారు. అమ్మవారి అలంకారాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్ధమనోహరమైన అమ్మవారి అలంకారాన్ని చూసిన భక్తులు తన్మయులయ్యారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముద్దనూరు : దసర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారు శ్రీ గాయిత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి కూష్మాండాదేవి, తలపనూరు గంగమ్మతల్లి, కీర్తిపల్లెనల్లనమ్మ, అనిమెల బోగాదమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గడ్డంవారిల్లె రాజరాజేశ్వరీదేవి లలితాత్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

జమ్మలమడుగు రూరల్ : శ్రీ అంబాభవాని ఆలయంలో ఆదివారం అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులకు కమిటీ నిర్వాహకులు ప్రసాదాలు పంచిపెట్టారు.

కమలాపురం : పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం శ్రీ గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. చుండూరు వెంకటసుబ్బరాజ కుటుంబ సభ్యులు అలంకారానికి, సత్యసామ్రాట్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీరె సమర్పించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని నవగ్రహ పూజలు, మంగళ హారతి నిర్వహించారు. అలాగే ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామి వ్రతం, నవ ధాన్యం, పూలు, పసుపు, కుంకుమలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. రాత్రి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.



ముద్దనూరులో గాయత్రీదేవి అలంకారంలో..



వీఎన్‌పల్లెలో అన్నపూర్ణాదేవిగా గంగమ్మతల్లి



జమ్మలమడుగులో శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో